నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | అక్టోబర్ 16, 2024 | www.navatelangana.com

ఇంటింటి సర్వేలో టీబీ రోగులను గుర్తించాలి

నవతెలంగాణ-నేరడిగొండ



ఆశాలు ఇంటింటికీ సర్వే చేస్తూ, టీబీ రోగులను గుర్తించి, మెరుగైన వైద్యం అందించేందుకు మండల వైద్యాధికారుల వద్దకు తీసుకురావాలని ఎన్‌సీడీ శిక్షకుడు అజయ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలకు ఎన్‌సీడీ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. షుగర్, డయాలసిస్ పేషెంట్ల సమాచారాన్ని వైద్యాధికారులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సద్దాం, పవార్ రవీందర్, హెచ్ఎస్ శ్రీనివాస్, హెచ్‌వీ స్వర్ణలత, మండల ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆరోగ్య సహాయకులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కలాం సేవలు చిరస్మరణీయం

నవతెలంగాణ-తలమడుగు



మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 93వ జయంతి వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో బ్ల్యూ భీం యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బ్ల్యూ భీం యూత్ అధ్యక్షుడు గొంటిముక్కుల ప్రేమేందర్ మాట్లాడుతూ భారతదేశపు మిస్సైల్ మ్యాన్‌గా పేరొందిన అబ్దుల్ కలాం ఎన్నో కష్టాలను సవాళ్లను ఎదుర్కొని అంచెలంచెలుగా మహా మేధావిగా ఎదిగారాని అన్నారు. భారత జాతి ముద్దు బిడ్డ అని అలాగే భారత రాష్ట్రపతి, క్షిపణి శాస్త్రవేత్త, సామజిక సేవకుడిగా దేశానికి సేవ చేశారన్నారు. ముఖ్యంగా విద్యార్థుల భవిష్యతే దేశ భవిష్యత్తు అని నినదించిన మహోన్నతుడని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయనను స్మరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, గంగన్న, శివమణి, సందీప్, ఈశ్వర్, సాయి బ్ల్యూ భీం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీతో పోరాడి నిధులను సాధించాలి

- మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అలయ్ బలయ్‌లతో కాదు బీజేపీతో పోరాడి నిధులను సాధించాలని మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. సీపీఐ(ఎం) జిల్లా 13వ మహాసభల ఏర్పాట్ల పరిశీలనకు ఆయన మంగళవారం విచ్చేశారు. అనంతరం పట్టణంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ ఆదిలాబాద్‌కు తలమానికంగా ఉన్న ప్రభుత్వ సిమెంట్ పరిశ్రమ సీసీఐని గత పాలకులు మూసివేశారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలు ఎన్నికల సందర్భంగా సీసీఐని తిరిగి ప్రారంభిస్తామని, హామీ ఇచ్చారని, కానీ ఆ హామీని నెరవేర్చకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే జిల్లాలో పత్తిపంట ఎక్కువగా పండిస్తున్నారన్నారు. ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయాలని, ఆదిలాబాద్ నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ప్రయాణానికి రైల్వే ప్రయాణం మహారాష్ట్ర నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. దీంతో ఎక్కువ సమయం ప్రయాణ భారం అవుతుందని తెలిపారు. వెంటనే ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వే లైన్ పనులను ప్రారంభించాలని అన్నారు. జిల్లాలో ఎప్పటి నుండో పెండింగ్‌లో ఉన్న విమానాశ్రయం నిర్మాణానికి కేంద్రప్రభుత్వం నిధుల కేటాయింపునకు స్థానిక బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే కృషి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోనే ఆదిలాబాద్ జిల్లా అంటేనే ఆదివాసుల జిల్లా అని పేరు కానీ గిరిజన యూనివర్సిటీని జిల్లాలో మంజూరు చేయలేదన్నారు. కనీసం యూనివర్సిటీ స్టడీ సెంటర్ అయినా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీ ప్రకారం కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించి ఆదిలాబాద్‌ను అభివృద్ధి పథంలో నడపాలని అన్నారు. ప్రజల పక్షాన సీపీఐ(ఎం) పోరాడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్, తొడసం భీంరావు, జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆత్రం కిష్టన్న, గంగన్న, సురేందర్, మంజుల పాల్గొన్నారు.

అర్హత గల వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హత గల వారు తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కార్యాచరణ విడుదల చేయడం జరిగిందని తెలిపారు. అర్హత గల వారు పట్టభద్రుల ఎమ్మెల్సీకు ఫారం-18, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీకి ఫారం-19 ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని, ఈ నెల 16వ తేదీన మొదటి రిపబ్లికేషన్, 25వ తేదీన 2వ రిపబ్లికేషన్ చేయడం జరుగుతుందని, నవంబర్ 6వ తేదీన నమోదు చేసుకునేందుకు ఆఖరి తేదీగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. నవంబర్ 20వ తేదీన నమోదు అయిన దరఖాస్తులను పరిశీలించి ముసాయిదా జాబితా సిద్ధం చేసి 23వ తేదీన ప్రచురించడం జరుగుతుందని, 23 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు ముసాయిదా జాబితాపై ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని, డిసెంబర్ 25వ తేదీన ఫిర్యాదులు, అభ్యంతరాలను పరిష్కరించి సంబంధిత పత్రాలను పరిశీలించి 30వ తేదీన తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. మొదటి రిపబ్లికేషన్ ఈ నెల 16న జరుగనున్న నేపథ్యంలో జిల్లాలోని ఎంపిక చేసిన ప్రాంతాలు, రాజస్వ మండల అధికారులు, మండల తహసీల్దార్ కార్యాలయాలలో రిపబ్లికేషన్ సంబంధిత నోటీసులు ప్రదర్శించాలని తెలిపారు. మెదక్-నిజామాబాద్- ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాలకు జరుగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలలో అర్హత గల ప్రతి ఒక్కరు తమ వివరాలు నమోదు చేసుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారులకు సరైన న్యాయం చేయాలి

- పాదయాత్ర ప్రారంభించిన ఉద్యమకారులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు తన మెనిఫెస్టోలో పెట్టిన విధంగా తెలంగాణ ఉద్యమకారులకు సరైన న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శ్రీశైలం అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పాదయాత్ర మంగళవారం ఆర్ అండ్ బి విశ్రాంతి భవనం నుంచి ప్రారంభమైంది. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలామలలు వేసి నివాళులర్పించారు. కారింగుల దామోదర్ జాతీయ జెండా ఊపి పాదయాత్రను సాగనంపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శ్రీశైలం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ధర్నాలు, రాస్తారోకో, జైళ్లకు కూడా వెళ్లామని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ ఉద్యమకారులను విస్మరించారని ఆరోపించారు. తెలంగాణ ఇస్తే ఏపీలో తమ పార్టీకి పుట్టగతులుండవని తెలిసికూడా సోనియా గాంధీ విద్యార్థుల బలిదానాలను చూసి ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారన్నారు. ఇప్పుడు పదేండ్ల తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఉద్యమకారుల గురించి ఆలోచించడం హర్షనీయమన్నారు. సమస్యలను విన్నవించడంతో పాటు ఉద్యమకారులను ఏకతాటికిపై తీసుకువచ్చేందుకు పాదయాత్రను చేపట్టామన్నారు. ఈ పాదయాత్ర ఈనెల 29న ఓయూ ఆర్ట్స్ కళాశాలలో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సామల ప్రశాంత్, నాయకులు సూజత్‌అలీ, తుడుం రాములు, నరేందర్, శ్రీధర్, అంజనేయులు, రఫీక్ దత్తు పాల్గొన్నారు.

ఉద్రిక్తతకు దారితీసిన డీఎస్సీ కౌన్సెలింగ్

- బాధితలకు న్యాయం చేయాలని ఆందోళన
- మధ్యాహ్నం నుంచి డీఈఓ కార్యాలయంలో పడిగాపులు
- ఉపాధ్యాయ, బీసీ సంఘాల మద్దతు
- భారీగా పోలీసుల మోహరింపు
- డీఈఓ ప్రణితను నిలదీసిన అభ్యర్థులు



ససససససస

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

డీఎస్సీకి ఎంపికై ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు మంగళవారం నిర్వహించాల్సిన కౌన్సెలింగ్, పోస్టింగ్ కేటాయింపు ప్రక్రియ అయోమయం, గందరగోళం, ఉద్రిక్తతల నడుమ సాగింది. జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు అభ్యర్థులకు కౌన్సిలింగ్‌కు రావాలని ఆహ్వానించారు. ఉదయం 10 గంటలకు కార్యాలయానికి అభ్యర్థులందరూ చేరుకోగా సందడిగా మారింది. కౌన్సెలింగ్ వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కసారిగా నిర్ణయం తీసుకోవడంతో అభ్యర్థులు అయోమయానికి గురై నిరాశతో వెనుతిరిగారు. కౌన్సిలింగ్ రద్దు అయిందని, వచ్చిన వారు హాజరు సంతకం చేసి వెళ్లిపోవాలని తరువాత కౌన్సిలింగ్ నిర్వహించే తేదీని చెబుతామని అధికారులు వారికి చెప్పారు. అభ్యర్థులు హాజరు వేసుకోని తిరిగి వెళ్తున్న క్రమంలో మళ్లీ డీఈఓ కార్యాలయం నుంచి మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సిలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని చెబుతు మేసేజ్ వచ్చింది. దీంతో అభ్యర్థులు పరుగుపరుగున మళ్లీ డీఈఓ కార్యాలయానికి చేరుకున్నారు.

బాధిత అభ్యర్థుల ఆందోళన

డీఎస్సీ అభ్యర్థుల ఎంపిక జాబితాలో కొందరికి తీవ్ర అన్యాయం జరిగింది. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేశాకే కౌన్సిలింగ్ నిర్వహించాలని బాధిత అభ్యర్థులు డిమాండ్ చేశారు. వీరికి ఉపాధ్యాయ సంఘాలు, బీసీ సంఘం మద్దతుగా నిలిచారు. కార్యాలయంలో డీఈఓను చుట్టుముట్టి గంటల పాటు ప్రశ్నల వర్షం కురిపించారు. అనంతరం కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు జాబితాలోని తప్పులను సవరించాలని డిమాండ్ చేశారు. డీఈఓ అవినీతికి పాల్పడిందని పోస్టులను అమ్ముకున్నారని సంచలన ఆరోపణలు చేశారు.

సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలి

ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభ్యర్థులు డీఈఓను ప్రశ్నించారు. దింతో డైరెక్టర్ కార్యాలయం నుంచి తప్పిదం జరిగిందని డీఈఓ చెప్పడంతో వారు ఏకీభావించలేదు. పోస్టింగ్ ముందు ఖాళీల వివరాలు, ఆప్షన్లు స్వీకరించకుండా కౌన్సిలింగ్ ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. కౌన్సిలింగ్ ప్రక్రియను వాయిదా వేసి తప్పులను సవరించాలని ఆ తరువాత నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యాలయ సూపరింటెండెంట్ కూడా బాధ్యత రహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆయనను కూడా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నియమకల్లో కలెక్టర్ చైర్మన్‌గా డీఈఓ కన్వీనర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జడ్పీ సీఈఓ సభ్యులుగా ఉంటారన్నారు. వారి సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

12వ ర్యాంక్ వచ్చిన జాబ్ రాలేదు

ఆదిలాబాద్ పట్టణం క్రాంతినగర్‌కు చెందిన నెరేళ్ల సాయికృష్ణ ఎస్జీటీలో 12వ ర్యాంక్ సాధించాడు. అయితే ఒకటి నిష్పత్తిలో అస్సలు పేరే లేదని జాబ్ రాలేదని వాపోయాడు. అలాగే ఉట్నూర్‌కు చెందిన సౌజన్య ఎస్జీటీ, ఎస్ఏలో ఉద్యోగాలు సాధించారు. ఆమె ఎస్ఏ కావాలని కోరగా బలవంతంగా ఎస్జీటీకి ఎంపిక చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మరొకరు పట్టణానికి చెందిన శివాజీ కండెకర్‌కు ఎస్ఏ ఫిజికల్ సైన్స్‌లో రెండవ ర్యాంక్ సాధించారు. అయితే ఆయనకు కాకుండా వేరే వారిని ఎంపిక చేశారని ఆవేదనకు గురయ్యారు.

బందోబస్తు నడుమ అధికారుల సమావేశం

ఒకవైపు సమయం దాటిపోతుంది. మరొకవైపు కౌన్సెలింగ్ ప్రక్రియ ఆగిపోవడతో ఎంపికైన అభ్యర్థులు బయట పడిగాపులు కాస్తున్నారు. దీంతో కౌన్సిలింగ్‌ను నిర్వహించేందుకు జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ఆర్డీఓ వినోద్ కుమార్, జడ్పీ సీఈఓ జితేందర్ డీఈఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. దాదాపు గంటపాటు ఈ సమావేశం నిర్వహించారు. కాగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐలు కరుణాకర్ రావ్, సునీల్ కుమార్, ఎస్సైలు పోలీసులు భారీగా మోహరించి బందోబస్తు చేపట్టారు.

కార్యాలయం వద్ద ఉద్రిక్తత.. నాయకులు అరెస్ట్

డీఈఓ కార్యాలయంలో అధికారులు నిర్వహించిన సమావేశం అనంతరం బాధిత అభ్యర్థులకు ఎలాంటి న్యాయం జరగకపోవడంతో ఉపాధ్యాయ సంఘాలు, బీసీ సంఘం నాయకులు కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. దింతో పోలీసులు జోక్యం చేసుకొని వారిని అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. డీఈఓ అవినీతికి పాల్పడ్డారని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల పక్షాన నిలబడితే అక్రమ అరెస్టులు చేయడం ఏంటని ప్రశ్నించారు. పోలీసులు వారి మాట వినకుండా బలవంతంగా వాహనంలో ఎక్కించి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో కార్యాలయం వద్ద కాస్త ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది.

ఎట్టకేలకు ప్రారంభమైన కౌన్సెలింగ్

ఉపాధ్యాయ సంఘాల నాయకులను అరెస్ట్ చేసిన అనంతరం పోలీసుల బందోబస్తు నడుమ కౌన్సిలింగ్ ప్రక్రియను ఎట్టకేలకు ప్రారంభించారు. ఒక్కొక్క అభ్యర్థిని పిలుస్తూ లోపలికి అనుమతించి కౌన్సెలింగ్ చేపట్టారు. వారికి ఒక ఫామ్ ఇచ్చి నింపాలని సూచించారు. అనంతరం వారికి పోస్టింగ్ ఆర్డర్ కాపీ ఇస్తూ ప్రక్రియ చేపట్టారు.



ససససససస



ససససససస

5వ షెడ్యూల్ ప్రాంతంలో ఇందిరమ్మ కమిటీలు చట్ట విరుద్ధం

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్కా గోవింద్‌రావ్

నవతెలంగాణ-నార్నూర్

కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన ఇందిరమ్మ కమిటీ ఎంపిక ప్రక్రియ సరైన పద్ధతి కాదని 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఇందిరమ్మ కమిటీలు చట్టవిరుద్ధమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్కా గోవింద్‌రావ్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో పూర్తి హక్కులు పేసా గ్రామ సభలకే ఉంటుందని, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కీలక పాత్ర పేసా గ్రామసభలకే ఉంటుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలనూ, కాంగ్రెస్ ప్రభుత్వం కుడా యాదావీధిగా పాటిస్తూ, ఏ మాత్రం ఏజెన్సీ ప్రాంత చట్టాలు పట్టించుకోకుండా ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా పని చేయడం సరైన పద్ధతి కాదని ఆయన మండిపడ్డారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఏజెన్సీ ప్రాంతంలో ఈ జీఓలో తగిన మార్పులు పేసా చట్టానికి అనుగుణంగా మార్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అన్ని ఆదివాసీ సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని తెలిపారు.

టాటా సోలార్‌లో చోరీ నలుగురి రిమాండ్

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని చౌటపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అక్టోబర్ 1న రాత్రి టాటా సోలార్ ప్లాంట్‌లో కాపర్ వైర్ చోరీ చేసిన కేసులో నలుగురు ఇందితులను మంగళవారం రిమాండ్‌కు తరళించినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. ఫెన్సింగ్ వైర్ కట్ చేసి ప్లాంట్ లోకి చొరబడి బీసీ కాపర్ వైర్ దొంగిలించారని సెక్యూరిటీ సూపర్ వైజర్ దూడ శేఖర్ ఫిర్యాధు మేరకు కేసు నమోదు చేసి తోడేటి భీమయ్య, తొడేటి వెంకటేష్, ఉరడి రవి, కోయ సురేందర్, ఎడ్ల రాజేష్‌లను కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ వివరించారు.

ఆదివాసీల దండారి దర్బార్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ సల్పాలవాగు అటవి ప్రాంతంలో ఈ నెల 27న నిర్వహించే దండారి దర్బార్‌ను విజయవంతం చేయాల్సిందిగా ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. మంగళవారం కాసిపేట మండలం దేవాపూర్ సల్పాలవాగు వెంకటాద్రి ఆలయం వద్ద దండారి నిర్వాహకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రతి ఏడాది నిర్వహించే దండారి దర్బార్ కార్యక్రమంకు 26న సాయంత్రం దండారీలు సల్పాలవాగు చేరుకోని 27న కార్యక్రమం నిర్వహించాల్సిందిగా తీర్మాణం చేశారు.

నిర్వహణ కమిటీ ఎన్నిక

దండారి వేడుకల నిర్వహణకు సంభంధించి నిర్వహణ కమిటిని ఆదివాసీలు ఎన్నుకోని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఆడ జంగు, గౌరవాధ్యక్షుడిగా రాయిసిడాం రాందాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్, ప్రధాన కార్యదర్శి సోయం సూరు, కోశాధికారి మడావి వెంకటేష్, ఉపాధ్యక్షుడు ఆడ జంగు, మడావి గోపాల్, టేకం రామకృష్ణ, రాయిసిడాం సోము, ప్రచార కార్యదర్శులుగా ఆత్రం జంగు, టేకం భగవంతరావు, ఇతర కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని చాంద(టి) గ్రామంలో మంగళవారం తహసీల్దార్ సాయిమహేష్ ఎల్‌ఆర్‌ఎస్ సర్వే వర్క్ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. అతి తొందరగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపాలి



నవతెలంగాణ-ఉట్నూర్

అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఉట్నూర్ డీఎస్పీ, సర్కిల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది ద్వారా ఏర్పాటు చేసిన గౌరవ వందనాన్ని స్వీకరించి డీఎస్పీ, సర్కిల్ కార్యాలయాల పరిసరాలను పరిశీలించారు. ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, సీఐ మొగిలి జిల్లా ఎస్పీకి పూల మొక్కతో స్వాగతం పలికడం, నూతనంగా ఏర్పాటు చేస్తున్న భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా అందుబాటులోకి తేవాలని సూచించారు. ఉట్నూర్ సబ్ డివిజన్ ఆదివాసీలతో మమేకమై ఉంటుందని, ఆదివాసీల గ్రామాలను సందర్శిస్తూ సత్సంబంధాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. ఆదివాసులకు ఎలాంటి అవసరాలైన అందుబాటులో ఉంటూ సహాయ సహకారాల అందించాలని సూచించారు. ఆదివాసులు అమాయకులను మోసం చేసే విధంగా ఎలాంటి దళారులను నమ్మకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాల బారిన పడకుండా, గంజాయి పండించడం, రవాణా, సేవించడం, లాంటి వాటికి అలవాటు పడకుండా, ప్రస్తుత సైబర్ నేరగాళ్లు ఉపయోగిస్తున్న నూతన విధానాలపై చైతన్యపరుస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలతో మమేకమై ఉంటూ పోలీస్‌స్టేషన్‌కి వచ్చే ప్రతి ఒక్క ఫిర్యాదుల సమస్యలపై నిషితంగా పరిశీలిస్తూ, న్యాయం చేకూరే విధంగా అధికారులను కేటాయించాలని తెలిపారు. నిఘా వ్యవస్థను పటిష్టం చేసుకుని సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేస్తూ ఉండాలని కోరారు. రికార్డుల నిర్వహణ, కేసుల పరిశోధన, దర్యాప్తు వేగవంతం చేస్తూ ఎటువంటి కేసులు పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. సిబ్బంది విధులపై నిరంతరం పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, సీఐలు మొగిలి, రహీం పాష, ఎస్ఐ మనోహర్, సీసీ రమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-తలమడుగు

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్ఈఓ చిన్నయ్య అన్నారు. మంగళవారం భరంపూర్ గ్రామంలో సవారి బంగ్లాలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని 2వందల మంది వైద్య పరీక్షలు నిర్వహించుకున్నట్టు తెలిపారు. వైద్యశిబిరానికి గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరీక్షలు చేసుకున్నారన్నారు. వ్యాధులను గుర్తించి, తగిన మందులను అందించడం జరిగిందన్నారు. సీరియస్ కేసులు ఎలాంటివి కూడా రాలేదని తెలిపారు. గ్రామంలో దగ్గు, జ్వరాలు, కాళ్ల నొప్పులు ఎక్కువగా ఉన్నట్టు తెలిపారు. మాజీ డీసీసీబీ చైర్మెన్ ముడుపు దామోదర్‌రెడ్డి వైద్య శిబిరాన్ని సందర్శించి, చక్కెర వ్యాధి బ్లడ్ ప్రెషర్ పరీక్షలు నిర్వహించుకోగా, అన్ని సర్వసాధారణంగా ఉన్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినప్పటికీ గ్రామస్తుల స్పందన బాగుందన్నారు. వైద్య శిబిరంలో కేదారేశ్వర్‌రెడ్డి, రాజు, నాగారెడ్డి, పోతారెడ్డి, యశోద, సూపర్‌వైజర్ ఎంఎల్‌హెచ్‌పీ శీతల్, శ్రీనివాస్, అనిల్, లక్ష్మి ప్రత్యూష, లక్ష్మి గోదావరి, ఆశ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | అక్టోబర్ 16, 2024 | www.navatelangana.com

విలీన సభ పోస్టర్లు విడుదల

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



ఈనెల 20న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగు ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియాలో ఐఎఫ్టీయూ విలీన సభ జయప్రదం చేయాలని, ఐఎఫ్టీయూ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న అన్నారు. జిల్లా కేంద్రంలో ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో మంగళవారం విలీన సభకు సంబంధించి వాల్ పోస్టర్లు విడుదల చేశారు. నాటి నుంచి నేటి వరకు పీఎఫ్టీయూ అనుబంధంగా ఉన్న వివిధ కార్మిక సంఘాలను నిర్మాణం చేస్తున్నామన్నారు. 26 రంగాల కార్మికుల చట్టబద్ధ యూనియనన్ను అనుబంధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్యామ్‌రావు, రవి, రాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

- పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు మెస్రం శేఖర్‌బాబు

నవతెలంగాణ-నార్నూర్



గాదిగూడ మండలంలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు మెస్రం శేఖర్‌బాబు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో డీఈఓ ప్రణీతను కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలోని మారేగావ్, కొలమా, బుద్దగూడ, డొంగర్‌గావ్, రాంపూర్, కూనికాసా, పౌనూర్, చిన్న కుండీ, అదేవిధంగా లోకారి(బి), మేడిగూడ గ్రామాల్లోని పాఠశాలలో విద్యార్థుల ఎక్కువగా ఉన్న చోట పాఠశాలలో ఉపాధ్యాయుల పోస్టులను చూపించి, భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయులను నియమించి మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

కొత్త టీచర్లకు పోస్టింగ్‌లు



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

డీఎస్సీ 2024 ద్వారా జిల్లాలో ఎంపికైన 278 మంది కొత్త టీచర్లకు అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించి, పోస్టింగ్‌లు కేటాయించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సిలింగ్ ప్రక్రియలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్ పాల్గొని, ఆయా కేటగిరిలా కొత్త టీచర్లకు ఉత్తర్వులు అందజేశారు.

పాడి పశువులతో ఆర్థికాభివృద్ధి



నవతెలంగాణ-ఇచ్చోడ

వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకం ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని మండల పశు వైద్యాధికారి గోవింద్ నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జాతీయ పశు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా ఉచిత సామూహిక గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని డాక్టర్ గోవింద్ నాయక్ వైద్య సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను 380 పశువులకు వేసినట్లు తెలిపారు. అందులో 150 ఆవులు, 160 గేదెలు, 70 ఎద్దలకు వేయడం జరిగిందని అన్నారు. పశుయజమానులు ముందస్తుగా ఉచిత గాలికుంటు టీకాలను వేయించడం ద్వారా పశువులకు గాలికుంటు వ్యాధి సోకాకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సహాయకురాలు సంధ్య, వైద్య సిబ్బంది శేఖర్, శ్రీను, పశు యజమానులు నరేష్, నారాయణ, ముత్తన్న, ఎల్లన్న పాల్గొన్నారు.

ఆర్థిక భారంతో సతమతమవుతున్నాం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

గత మూడు సంవత్సరాల నుంచి కాలేజీలకు రావాల్సిన బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ స్కాలర్‌షిప్‌ల బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో కాలేజీలను నిర్వహించలేక ఆర్థిక భారంతో సతమతమవుతున్నామని అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా ప్రయివేట్ డిగ్రీ కళాశాల యాజమాన్య సర్వసభ్య సమావేశం స్థానిక వశిష్ఠ డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధ్యాపకులకు జీతభత్యాలు, భవనాలకు అద్దె, కరెంటు బిల్లులు చెల్లించలేక ఆర్థిక భారంతో సతమతమవుతున్నామని అన్నారు. బకాయిలు చెల్లించాల్సిందిగా యాజమాన్య సంఘాలు, గత రెండు సంవత్సరాల నుంచి అనేకసార్లు పలు మంత్రులను సంబంధిత అధికారులను, జిల్లా కలెక్టర్లను కలిసి వినతిపత్రాలు అందించిన ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. తప్పని పరిస్థితుల్లో యాజమాన్య సంఘాలు కళాశాలల బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ పిలుపునకు ఆయా యూనివర్సిటీలకు సంబంధించిన రిజిస్ట్రార్లకు రాతపూర్వకంగా వినతిపత్రం ఇవ్వడం జరిగిందని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌ల బకాయిలు విడుదల అయ్యేవరకు నిరవధికంగా బంద్ పాటిస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కళాశాలల ఆర్థిక సంక్షోభాన్ని అర్థం చేసుకొని, గౌరవ పోషకులు విద్యార్థులు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు వెంకట్‌రెడ్డి, సాయి, అఖిల్ సింగ్, విఠల్‌రావు, వెంకటేష్‌గౌడ్, బాలానంద్, రవి, లక్ష్మణ్, సంజీవ్, శ్రీనివాస్, లోహిత్, వర్ధన్, శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంట్లో చోరీకి యత్నం

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు ఇంట్లో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి ప్రయత్నం చేసినట్టు మంచిర్యాల సీఐ బన్సీలాల్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ముగ్గురు మొహానికి మాస్కులు పెట్టుకొని గేట్‌పై నుంచి దూకి లోపలికి వెళ్లి సీసీ కెమెరాలు విరగ్గొట్టారని పెద్ద ఎత్తున శబ్దాలు రావడంతో వాచ్‌మెన్ మల్లయ్య ఒక్క సరిగా కేకలు వేయడంతో చోరీకి వచ్చిన వ్యక్తులు పారిపోయారని వాచ్‌మెన్ మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ప్రయివేట్ పీజీ, డిగ్రీ కళాశాలు బంద్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఫీజు రియంబర్స్‌మెంట్ పథకంలో భాగంగా డిగ్రీ, పీజీ కళాశాలకు ఆర్టీఎఫ్ చెల్లింపులు చేయాలని ప్రయివేట్ పీజీ, డిగ్రీ కళాశాలల యాజమన్యాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగానే జిల్లాలోని అన్ని ప్రయివేట్ పీజీ, డిగ్రీ కళాశాలలను మంగళవారం నుంచి మూసివేశారు. ఆర్టీఎఫ్ వచ్చిన తరువాతనే కళాశాలను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. బగుడు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకుడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఆర్టీఎఫ్, స్కాలర్‌షిప్‌లను అందిస్తుందన్నారు. మూడు సంవత్సరాలుగా ఇవి పెండింగ్‌లో ఉండటంతో కళాశాల నిర్వహణ భారంగా మరుతోందని యజమన్యాలు చెబుతున్నాయి. జిల్లా కేంద్రలోని కళాశాలలు కూడా మూతపడ్డాయి.

నిధులు చెల్లించేంత వరకు బంద్ పాటిస్తాం..

కాగా ప్రయివేట్ పీజీ డిగ్రీ కళాశాల యాజమన్యాల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. ఫీజు రియంబర్స్‌మెంట్ కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రారంభించిందన్నారు. బీఆర్ఎస్ హయంలో సంవత్సరం, రెండు సంవత్సరాలకు ఒకసారి చెల్లించేవారన్నారు. అధికారంలో లేని సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫీజు రియంబర్స్‌మెంట్ గురించి మాట్లాడారన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత వాటి గురించి పట్టించుకోవడం లేదన్నారు. నిధులు లేక అద్దె భవనాల కిరాయిలు, ట్యాక్సులు చెల్లించలేని స్థితికి వచ్చామన్నారు. ఆర్టీఎఫ్ నిధులు చెల్లించేంత వరకు రాష్ట్ర సంఘం సూచనల మేరకు కళాశాలలను మూసి ఉంచుతామని స్పష్టం చేశారు.

ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. మంగళవారం ఏపీజే అబ్దుల్ కలాం 83వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. భారత రక్షణరంగ బలోపేతానికి కృషి చేశారని అన్నారు. మున్సిపల్ పాలకవర్గం తరపున విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు నాందేడపు చిన్నూ, అజీమ్ బిన్ యహియా, సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు మహమ్మద్ అజారుద్దీన్, ఉపాధ్యక్షులు మహమ్మద్ అన్వర్, షబ్బీర్ అహ్మద్, కౌన్సిలర్లు ఇమ్రాన్ ఉల్లా, ముజాహీద్ అలీ, అబ్దుల్ సయిద్, ముజాహీద్ చౌస్, అబ్దుల్ మజీద్, సయ్యద్ అబ్రార్, అబ్దుల్ మతిన్, అన్వర్ పాషా, రఫీ, కొండ శ్రీధర్, పలువురు నాయకులు ఉన్నారు.

బోథ్ : ఏపీజే అబుల్ కలాం సేవలు మరువలేనివని పూలే వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు గాజుల పోతన్న, ప్రధాన కార్యదర్శి బత్తుల రమేష్ అన్నారు. మంగళవారం మండలంలో సొనాల గ్రామంలోని పూలే వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒక సాధారణ కుటుంబంలో పుట్టి పేపర్‌బాయ్‌గా పనిచేసి రక్షణ రంగంలో విశేష కృషిచేసి సీఎస్ఎల్వీ ప్రయోగాలు గాని ప్రోక్రాన్-2 ప్రయోగాలు చేసి రక్షణ రంగంలో అగ్ర దేశాల సరసన చేర్చినటువంటి వ్యక్తి అబ్దుల్ కలాం అని గుర్తు చేశారు. భారత రాష్ట్రపతిగా విశేష సేవలు అందించి, భారతదేశ అభివృద్ధిలో తన వంతు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అమృత్‌రావు పాటిల్, కొప్పెర్ల శేఖర్, గోరే బాయ్, అంకుష్, మహిబూబ్, చెట్లపెల్లి అనిల్, వెంకటేష్, పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : భారత రక్షణ రంగం బలోపేతానికి కృషి చేసిన వ్యక్తి ఏపీజే అబ్దుల్ కలాం అని అమాన్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు అర్షత్‌ఖాన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో అబ్దుల్ కలాం 93వ జయంతిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ యువతకి ఆదర్శప్రాయుడు చదువు ప్రాముఖ్యతను యువతలో పెంపొందించి గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, అమన్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు పరమేశ్వర్, కార్యదర్శి అజీమ్ ఉన్నారు.

జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు తాళం



నవతెలంగాణ-తాండూర్

మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు మంగళవారం బిల్డింగ్ యజమాని సురభి శరత్ కుమార్ తాళాలు వేశారు. అద్దె చెల్లించనందుకు యజమాని గురుకులానికి తాళాలు వేయడంతో బోధన సిబ్బంది గురుకులంలోకి వెళ్లలేక రోడ్డుపైన ఉండాల్సి వచ్చింది. విద్యార్థులు దసరా సెలవులకు సొంత గ్రామాలకు వెళ్లి తిరిగి రాక పోవడంతో ఇబ్బందికర పరిస్థితులు విద్యార్థులకు తప్పినట్లు అయింది. హైవే రోడ్డుకు పక్కనే ఉన్న గురుకులానికి తాళం వేయడంతో బోధన సిబ్బంది నేషనల్ హైవే రోడ్డుపై నిరీక్షించాల్సి వచ్చింది. పరిస్థితిని గమనించిన ప్రయాణికులు వాహనదారులు ప్రభుత్వ పనితీరు తప్పుపట్టారు. విద్యావ్యవస్థకు నిధులు వెచ్చించడంలో ప్రభుత్వం విఫలమవుతుందని ఆరోపించారు. గురుకులాలకు సొంత భవనాలను సమకూర్చాల్సిన ప్రభుత్వాం అద్దె చెల్లింపులో జాప్యం చేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు గురుకులంలో ఉన్నట్లయితే తీవ్రమైన ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడేవని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డింగ్ యజమాని శరత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం గత 11 నెలలుగా రూ.9.90 లక్షల అద్దెను చెల్లించలేదని తెలిపారు. భవనాలకు కరెంటు బిల్లు మెంటెనెన్స్ చార్జీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. గురుకుల విద్యా లయ ప్రయివేట్ భవన యాజమాన్య సంఘం నిర్ణయం మేరకు తాళం వేసినట్లు పేర్కొన్నారు.

కుమురంభీం వర్ధంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఇచ్చోడ



జల్, జంగల్, జామిన్ అనే నినాదంతో ఆదివాసీలకు మార్గం చూపి, ధైర్యం నింపిన కుమురంభీం 84వ వర్ధంతిని ఈ నెల 17న మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించుటకు ఆదివాసీ నాయకులు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో వచ్చి వర్ధంతిని విజయవంతం చేయాలని, సార్మేడి నాయకులు కోరారు. ఈ సందర్భంగా రాయిసెంటర్ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నాడు నిజాం నవాబు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన కుమురంభీం వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా సెలవు దినంగా ప్రకటించి, ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడిగూడ సార్మేడి మెస్రం శంభు, గ్రామపటేల్ మాధవి, భీంరావు, రాము, గంగారాం, జ్యోతిరాం, దేవురావు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : కుమురంభీం వర్ధంతిని ఈనెల 17న ఘనంగా నిర్వహిస్తున్నామని, ఆదివాసీ గిరిజనులు, ఉద్యమ నాయకులు, తొమ్మిది తెగల ఆదివాసీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని హీరాసుక జాగృతి సమితి అధ్యక్షుడు సిడాం రాంకిషన్ కోరారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలను వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఆదివాసీ ఉద్యమకారుడు, క్రాంతివీరుడు, ఆదర్శప్రాయుడు, ఆదివాసీ ముద్దుబిడ్డ కుమురంభీం 87వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని, అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి కోసం పని చేయాలని అన్నారు. ఈ వర్ధంతిలో ఆదివాసీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్మల్ జిల్లా పరిధిలో ఔత్సహిక ఫోటోగ్రాఫర్లకు ఫోటోగ్రఫీ, వీడియో గ్రాఫర్లకు షార్ట్ ఫిల్మ్‌కు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీసు అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ ఈనెల 21న వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండాలని అన్నారు. ఇటీవల కాలంలో తీసిన 3ఫోటోలు, తక్కువ నిడివి 3 నిమిషాలు గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈనెల 20వ తేదీలోపు మీ దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో సంబంధిత షార్ట్ ఫిల్మ్ లోడ్ చేసిన పెన్‌డ్రైవ్, 10, 8 సైజ్ ఫోటోలను అందజేయాలన్నారు. ఈ క్రింది అంశాలపై పోటీలకు నామినేషన్లు పంపించాలన్నారు. మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్ఠలు, సైబర్ నేరాలు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, మత్తు పదార్థాల సేవనం, వాటి అనర్థాలు అంశాలకు సంబంధించి గత సంవత్సరం 2023 అక్టోబర్ నుంచి ప్రస్తుత సంవత్సరం అక్టోబర్ నెల ఇప్పటివరకు తీసిన మూడు ఫోటోలు, షార్ట్ ఫిల్మ్ మాత్రమే పంపించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 21వ తేదిలోపు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఐటీ కోర్ ఆఫీసులో ఇవ్వాల్సి వుంటుందని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే జ్యోతిమణి, ఐటీ కోర్ ఎస్సై మొబైల్ నెంబర్ 8712577719ను సంప్రదించాలన్నారు.

ముందస్తు ప్రణాళికలు వేసుకోవాలి

నస్పూర్ : ఉత్పత్తి ఉత్పాదకత సాధించడానికి ముందస్తు ప్రణాళికలు వేసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏరియా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ గత నెల సాధించిన ఉత్పత్తి ఉత్పదకతను, సాధించిన లక్ష్యాలను సమీక్షించి, అక్టోబర్ నెలలో కంపెనీ నిర్దేశిత లక్ష్యాలను సాధించడానికి ప్రతి ఒక్క ఉద్యోగి, అధికారి కృషి చేయాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పదకతను సాధించాలన్నారు. గనులలో యంత్రాల వినియోగం 100 శాతం ఉండడానికి ప్రయత్నించాలని ఉపరితల గనులలో ఓబి కాంట్రాక్ట్ కంపెనీ వారు నిర్దేశిత రోజువారి లక్ష్యాన్ని సాధించాలని దానికి అనుగుణంగా ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్లు టి శ్రీనివాస్, ఏవీ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజెంట్లు రాముడు, శ్రీధర్, డీజీఎంలు పి అరవిందరావు, చిరంజీవులు, మల్లయ్య, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్‌రావు, పర్చేజ్ ఎస్ఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఆసిఫాబాద్ : ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆసిఫాబాద్ బస్ స్టేషన్ ప్రాంగణంలో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్విచక్ర వాహనదరులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, త్రిబుల్ రైడ్ చేయకూడదన్నారు. ప్రజలు ఆర్టీసీ బస్‌లోనే ప్రయాణించాలని, గమ్యం యాప్ ప్రతి ఒక్కరూ మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవడం వల్ల బస్సు నెంబర్ నమోదు చేస్తే బస్సు ఎక్కడ ఉందని లొకేషన్ క్లియర్‌గా చూపుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీసీ శంకర్, ఏడీసీ సేఫ్టీ వార్డెన్ పోచం, ప్రయాణికులు పాల్గొన్నారు.

జగదాంబదేవిని దర్శించుకున్న ఆడే గజేందర్

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని బుగ్గారం గ్రామంలో సాయి మహరాజ్ జగదాంబదేవిని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, శాలువాతో సన్మానించారు. ఆయన వెంట మండల కన్వీనర్ ఆడే వసంతరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రూప్‌సింగ్, జిల్లా సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, బోథ్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, మండల నాయకులు కపిల్, హరిచంద్, ప్రవీణ్, రోహిదాస్, రాజేష్, హెమ్య నాయక్, ధనరాజ్, గ్రామ ప్రజలు జగదీష్, ఆర్. దేవరావు పాల్గొన్నారు.

సద్గురు నారాయణ బాబా పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-తలమడుగు

సంత్ సద్గురు నారాయణ బాబా 18వ సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం భరంపూర్ గ్రామంలో మాజీ డీసీసీబీ చైర్మెన్ ముడుపు దామోదర్‌రెడ్డి చేతుల మీదుగా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా నారాయణ బాబా సంస్థాన్ అధ్యక్షుడు జాదవ్ కిషన్ మాట్లాడుతూ ఈనెల 18, 19 తేదీల్లో రెండు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. కార్యక్రమానికి ఇతర రాష్ట్రాలతో పాటు జిల్లాల, మండలాల పీఠాధిపతులు హాజరుకానున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గాండ్ల రాజు, కేదారేశ్వర్‌రెడ్డి, సుధాం, యాదవ్, నాగారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఐటీయూ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

పట్టణ ఆర్పీల జిల్లాస్థాయి సమావేశాన్ని మంగళవారం ఏఎస్‌జీఓ భవనంలో నిర్వహించి, నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం పట్టణ ఆర్పీల సమస్యలపై జిల్లా కలెక్టర్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో, నిర్మల్ జిల్లాలో 3 మున్సిపాలిటీల్లో దాదాపు 92 మంది ఆర్పీలు పని చేస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీ ఉన్న ఎస్‌హెచ్‌జి, ఎస్ఎల్ఎఫ్, టీఎల్ఎఫ్‌లకు బుక్ కీపింగ్, మహిళలకు బ్యాంకు రుణాలు, స్త్రీ నిధి నుంచి రుణాలు ఇప్పించడం, ఆ రుణాలను సకాలంలో చెల్లించేలా చూడటం, మహిళల అభివృద్ధికి మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నారు. మహిళలు ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి వారికి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారని అన్నారు. ఆర్పిలకు కనీస వేతనం రాష్ట్రంలో అమలవుతున్న జీఓ నెంబర్ 60 ప్రకారం రూ.16వేల 600 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ప్రతి ఆర్పికి రూ.10 లక్షల సాధారణ బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఆర్పీలకు ప్రతి నెల రెగ్యులర్‌గా వేతనాలు ప్రభుత్వమే వారి వ్యక్తిగత ఖాతాలో వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్పీలకు ఒకే రకమైన డ్రెస్ కోడ్ ఉండాలని, హెల్త్ కార్డులు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నూతన జిల్లా కమిటీ ఎన్నిక

జిల్లా గౌరవాధ్యక్షులుగా బొమ్మెన సురేష్, జిల్లా అధ్యక్షురాలు గడ్డం భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షులు రాజు, సల్మా, ఎ.పద్మ స్వరూప, ప్రధాన కార్యదర్శి దుర్గే జ్యోతి, సహాయ కార్యదర్శులు వరలక్ష్మి నీరజ, లక్ష్మి, నర్సయ్య, జిల్లా కోశాధికారి కృష్ణవేణి ఎన్నికయ్యారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

- పల్లి(బి)లో పశు వైద్య శిబిరం



నవతెలంగాణ-తలమడుగు

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పీఏసీఎస్ చైర్మెన్ దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని పల్లి(బి) గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఆయన మాట్లాడారు. కార్యక్రమం అక్టోబర్ 15 నుంచి నవంబర్ 14 వరకు ఒక నెల రోజుల పాటు వైద్య శిబిరం కొనసాగుతుందని తెలిపారు. పశువులు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పశుసంవర్ధక శాఖ సిబ్బందిచే టీకాలను ఇప్పించుకోవాల్సిందిగా కోరారు. డాక్టర్ దూద్‌రామ్ రాథోడ్ మాట్లాడుతూ ఈ వ్యాధి వైరస్ వలన వస్తుందన్నారు. ఒక పశువు నుంచి మరో పశువుకు సోకే ప్రమాదం ఉందన్నారు. పాలిచ్చే ఆవులు, గేదెలకు వచ్చిన ఎడల పూర్తిగా పాల దిగబడి తక్కువ అవుతుందని, ఆర్థికంగా నష్టం కలుగుతుందని అన్నారు. సుడి పశువులు అబార్షన్ అయ్యే అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది సౌమ్య, హరీష్, పవన్, విజయ్, సుదర్శన్ గోపాల మిత్రులు, డైరీ ఫార్మర్ రవీందర్‌రెడ్డి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని విమర్శించడం సరికాదు



నవతెలంగాణ-ఉట్నూర్

ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని విమర్శించడం సరికాదని మాల సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు ఎర్రదండి సుశీల్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని విమర్శించే స్థాయి ఎమ్మార్పీఎస్ నాయకులకు లేదని అన్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన వర్గీకరణ విషయంలో ఏమాత్రం మాట్లాడలేదని, వర్గీకరణ చేయాలంటే 2024 జనాభా గణన పూర్తిచేసి, వర్గీకరణ చేయాలని అన్నారని తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. వర్గీకరణ విషయంలో మాలల జనాభాను కచ్చితంగా చూపించాలని అన్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలని చెప్పే హక్కు ఎవరికీ లేదని అన్నారు. ఈ సమావేశంలో కాటం రమేష్, తౌటి ఆశన్న, కడమండ్ల రాజమణి, నందం, కోడి ప్రభాకర్, మంత్రి రాజన్న పాల్గొన్నారు.

కొనసాగుతున్న సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం మెదక్ సంగారెడ్డి జిల్లాలో, అసెంబ్లీ నియోజకవర్గంలో జరుగుతున్న సభ్యత్వ నమోదు తీరుని ఆయన పరిశీలించారు. ప్రజాస్వామ్య దేశాల్లోనే ప్రపంచ దేశాలలోనే కాకుండా ఎక్కువ సభ్యులు కలిగినటువంటి పార్టీ బీజేపీ అన్నారు. ఏ ఇంటికి వెళ్లిన స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పార్టీ సభ్యత్వ నమోదు చేసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ నాయకులు జిల్లా నాయకులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | అక్టోబర్ 16, 2024 | www.navatelangana.com

ప్రయివేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల ర్యాలీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కాగజ్‌నగర్‌లో ప్రయివేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ర్యాలీ నిర్వహించాయి. ఆయా కళాశాలల విద్యార్థులతో నిర్వహించిన ఈ ర్యాలీ పలు వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా వివేకానంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ అనూక్ మాట్లాడుతూ మూడేండ్లుగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్‌లు విడుదల చేయకపోవడంతో కళాశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. వెంటనే వీటిని విడుదల చేసి ప్రయివేట్ డిగ్రీ కళాశాలలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు బి.శ్రీనివాస్, నిరత్కర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పందించిన విద్యుత్ అధికారులు

నవతెలంగాణ-కౌటాల



మండలంలోని తాటిపల్ గ్రామానికి చెందిన మిర్చి రైతులు సోమవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. నిరాంతరం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో మిర్చి పంట ఎండిపోతుందని రైతులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. మంగళవారం ఏడీఈ రాజేశ్వర్ ఆధ్వర్యంలో నాణ్యమైన విద్యుత్ రైతులకు అందించడానికి మరమ్మత్తులు చేపట్టారు. రైతుల కోసం ఎల్లవేళలా విద్యుత్ సరఫరా అందించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా అందించలేకపోతున్నామని అధిక లోడ్ కారణంగా లో వోల్టేజ్ సమస్య తలెత్తుతుందన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడానికి ఏడీఈ శ్రీనివాస్, ఏఈ రవీందర్, విద్యుత్ అధికారులు మాదవ్ రమేష్, ప్రవీణ్ మరమ్మత్తులు చేపట్టారు.

డ్రైవర్లు, యాజమానుల కుటుంబసభ్యులతో ధర్నా



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లు వైఖరిని నిరసిస్తూ కాగజ్‌నగర్ లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోషియేషన్ చేపడుతున్న ఆందోళన రోజురోజుకు పెరుగుతోంది. మంగళవారం లారీ అసోషియేషన్ కార్యాలయం ముందు కుటుంబ సభ్యులతో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో పాటు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సంఘీభావం తెలిపారు. కుటుంబ సభ్యులు చేపడుతున్న ధర్నా శిబిరాన్ని కోనేరు కోనప్ప సతీమణి రమాదేవి సందర్శించి ధర్నాలో పాల్గొన్నారు. లారీల కిరాయి పెంచాలని డిమాండ్ చేస్తూ తాము ఆందోళన చేస్తున్నా ఎస్పీఎం యాజమాన్యం స్పందించకపోవడం సరికాదని ఈ సందర్భంగా లారీ ఓనర్స్ అసోషియేషన్ అధ్యక్షులు కిషోర్‌బాబు అన్నారు.

సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్



నవతెలంగాణ-రెబ్బెన

బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని కార్యకర్తలు, నాయకులు పూర్తి చేయాలని ఆదిలాబాద్ ఎంపీ నగేష్ అన్నారు. మంగళవారం మండలంలోని నారాయణపూర్ గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త నడుము బిగించాలని సూచించారు. సభ్యత్వ నమోదులో క్రియాశీలకంగా కార్యకర్తలు వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో అరిగేలా నాగేశ్వరరావు, ఆదిలాబాద్ పార్లమెంట్ కో కన్వీనర్ కొలిపాక కిరణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు గుల్బం చక్రపాణి, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి మండల అధ్యక్షులు గోలెం తిరుపతి, నాయకులు కృష్ణకుమారి, ఓదెలు రాంబాబు పాల్గొన్నారు. అనంతరం ఆసిఫాబాద్ అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి పుట్టినరోజు వేడుకలు గోలేటిలోని ఆమె సహా గృహంలో ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ నగేష్‌తో కలిసి కేక్‌కట్ చేశారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-వాంకిడి

గ్రామీణ బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆసిఫాబాద్ చీఫ్ మేనేజర్ విశ్వనాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆవరణలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ కృష్ణయ్య అధ్యక్షతన సేవలపై ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామీణ బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

బదిలీ అయిన విద్యుత్ ఏఈకి సన్మానం



నవతెలంగాణ-కౌటాల

బదిలీపై వెళ్లిన కౌటాల విద్యుత్ శాఖ ఏఈ రవిందర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏడీ రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని, ఎక్కడ పనిచేసిన బాధ్యతయుతంగా నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బెజ్జూర్ ఏఈ అంజన్ కుమార్, సబ్ ఇంజనీర్ అజయ్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యాసంస్థలకు సెలవు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కుమురం భీం వర్ధంతి సందర్భంగా ఈ నెల 17న జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలకు స్థానిక సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థలు ఈనెల 17న సెలవు దినం పాటించాలని, ఇందుకు బదులుగా నవంబర్ 9న 2వ శనివారం పని దినముగా నిర్వహించడం జరుగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బీఆర్ ఏఓయూ పరీక్ష ఫీజు చెల్లించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్‌వర్సిటీలో డిగ్రీ అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు సెమిస్టర్-2 పరీక్ష రాసేందుకు పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20 వరకు రూ. 1000 అపరాధ రుసుముతో చెల్లించడానికి అవకాశముందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్: 7382929651, 9494314314 నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

కౌన్సెలింగ్ ప్రక్రియలో గందరగోళం

- కనీస వసతుల కరువు
- రాత్రి వరకు కొనసాగిన కౌన్సెలింగ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగానికి ఎంపికైన సంతోషం ఎంతోసేపు నిలవకుండా పోయింది. ఫలితాలు వచ్చిన నాటినుండి ఎప్పుడు పోస్టింగ్ ఇస్తారని ఎదురుచూసిన అభ్యర్థులకు విద్యాశాఖ సోమవారం శుభవార్త తెలిపింది. మంగళవారం ఉదయం చేపట్టే కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరుకావాలని ఉత్తర్వులు విడుదల చేసింది. అభ్యర్థులకు జిల్లా కేంద్రంలో చేపట్టిన కౌన్సెలింగ్ ప్రక్రియ ఇబ్బందులకు గురిచేసింది.

కౌన్సెలింగ్ ప్రక్రియలో గందరగోళం

మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించాల్సిన కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించి ఉదయం నుండి అభ్యర్థులు జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలకు చేరుకున్నారు. రాష్ట్ర విద్యాశాఖ నుండి ఎటువంటి ఉత్తర్వులు రాకపోవడంతో అధికారులు వారికి సమాచారం అందించలేదు. దీంతో ఉదయం 10 గంటలకు ప్రారంభించిన కౌన్సెలింగ్ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైంది.

ఖాళీల జాబితాల పదేపదే మార్పు

ఉదయం జిల్లాలోని ఖాళీల జాబితాలను ప్రకటించిన అధికారులు దానిని పదేపదే మార్చడం కూడా అభ్యర్థుల్లో గందరగోళాన్ని సృష్టించింది. మొదట తమ ర్యాంకు సంబంధించి ఏ మండలంలో పోస్టింగ్ వచ్చే అవకాశం ఉందనేది నిర్ధారించుకునే లోపు మరో జాబితా అధికారులు ప్రకటించడంతో అభ్యర్థులు గందరగోళంలో పడడం మినహా చేసేదేమీ లేకుండా పోయింది. ఉపాధ్యాయులు లేని చోట మొదట ప్రాధాన్యత ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

కేంద్రంలో కనీస వసతులు కరువు

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి చిన్నపిల్లలను తీసుకొని కౌన్సెలింగ్ కేంద్రానికి వచ్చిన మహిళలు ఇబ్బందులు పడ్డారు. కేంద్రానికి ఉదయం 10 గంటలకల్లా చేరుకున్న అభ్యర్థులు కేంద్రంలో కనీసం టెంట్ కూడా లేకపోవడంతో చెట్ల నీడన సేద తీరాల్సి వచ్చింది. రాత్రి అయిన కనీసం లైటింగ్ పెట్టకపోవడంతో పలు సంఘాల నాయకులు ప్రశ్నించడంతో రాత్రి 7 గంటలకు లైటింగ్ అమర్చారు.

రాత్రి వరకు కొనసాగిన కౌన్సెలింగ్

జిల్లాలో ఖాళీగా ఉన్న 300కు పైగా పోస్టులకు గాను మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్ ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది. రాత్రి 8 గంటల వరకు సగం ప్రక్రియను పూర్తి చేసిన అధికారులు మిగతా ప్రక్రియ పూర్తి కావడానికి మరో మూడు గంటలు పడుతుందని వెల్లడించారు.

కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి చేస్తాం

ఉదయ బాబు, జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారి

కౌన్సెలింగ్ ప్రక్రియ మొదట వాయిదా పడుతుందని భావించాం. తిరిగి ప్రారంభించడంతో వసతుల కల్పనలో కొంత ఆలస్యమైంది. పకడ్బందీగా కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. అభ్యర్థులకు ఇబ్బందులు కాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

రక్షణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గీత కార్మికుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య రక్షణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఎస్పీ డీవీ శ్రీనివాస రావు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా ఆబ్కారీ శాఖ పర్యవేక్షకులు జ్యోతి కిరణ్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమం, రక్షణకు అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఈ క్రమంలో గీత కార్మికులకు ప్రమాదాలు జరగకుండా వారికి శిక్షణ ఇచ్చి కాటమయ్య రక్షణ కిట్లను అందించడం జరిగిందని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలో 38 మంది గీత కార్మికులకు అందించామని, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 31 మందికి ఈ కిట్లను అందించడం జరుగుతుందని తెలిపారు. గీతా కార్మికులు ఈ రక్షణ కిట్లను ధరించి చెట్లు ఎక్కాలని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మీ మాట్లాడుతూ గీత వృత్తిని గౌడ కులస్తులు తరాల నుండి కొనసాగిస్తూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. గీత కార్మికుడిపై కుటుంబం ఆధారపడి ఉంటుందని, ప్రతి గీత కార్మికుడు రక్షణ కిట్లను ధరించి తన వృత్తిని కొనసాగించాలన్నారు. ప్రమాదాలను నివారించి కుటుంబ సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు అలీబిల్ అహ్మద్, జిల్లా ఇన్‌చార్జి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సజీవన్, ఎక్సైజ్ సీఐ రమేష్, గౌడ సంఘం నాయకులు బాలేష్ గౌడ్, రంగు మహేష్ గౌడ్, గీత కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

సిర్పూర్ పేపర్ మిల్లు ప్రతినిధులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు సమస్యలను సమన్వయంతో సామరస్యంగా పరిష్కరించుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాలతో కలిసి సిర్పూర్ పేపర్ మిల్లు ప్రతినిధులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేపర్ మిల్లు ప్రతినిధులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యుల మధ్య నెలకొన్న సమస్యల సంబంధిత అంశాలపై కమిటీ వేసి సమగ్ర విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కంపెనీ నిర్వహణ దృష్ట్యా మిల్లు ప్రతినిధులు స్థానిక లారీ యజమానులకు పని కల్పించాలని, ఎలాంటి వివాదాలకు తావు లేకుండా చర్చించుకొని రవాణ ధరలను నిర్ణయించుకోవాలని, మిల్లు అభివృద్ధితో పాటు లారీ యజమానులు లబ్ధి పొందేలా సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డీఎస్పీలు, సిర్పూర్ మాజీ శాసనసభ్యులు కోనేరు కోనప్ప, ఎస్పీఎం ప్రతినిధులు, లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం



కాగజ్‌నగర్ : జూనియర్ కళాశాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పీఓ ప్రకాశ్ అధ్యక్షతన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంధ్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం కోసం ఏపీజే అబ్దుల్ కలాం ఎనలేని సేవలు చేశారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. పేపర్ బాయ్ నుంచి దేశ రాష్ట్రపతిగా ఎదిగిన ఘనత ఏపీజే అబ్దుల్ కలాంకు ఉందని, ఆయన కన్న కలలు నిజం చేయాలనారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కౌటాల : మండలంలోని ముత్తంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి గావుడే హనుమంతు ముందుగా కలాం చిత్ర పటానికి పూల వేసి ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులు అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కౌటాల : ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్ఎం

ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన



ఎన్‌హెచ్‌ఎంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో డా.మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం ఈ క్యాడర్లను ఏర్పాటు చేసిందన్నారు. ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డ్స్, హెల్త్ ఇన్సూరెన్సు ఉద్యోగి, కుటుంబ సభ్యులందరికి వర్తించే విధంగా ప్రభుత్వం అమలు చేయాలన్నారు. మహిళా ఉద్యోగస్తులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంపుదలకు కమిటీ వేశామని, సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన కాంగ్రెస్ 10 నెలలు గడుస్తున్న ఎలాంటి చర్యలు లేవన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16న హైదరాబాద్ ఎన్‌హెచ్ఎం రాష్ట్ర డైరెక్టరేట్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో 2వ ఏఎన్ఎంలు ప్రమీల, పద్మ, సునీత, విజయలక్ష్మి, తులసి, వనిత, శ్రీవిద్య, రుచిత, మృదుల్ మాండల్ పాల్గొన్నారు.

నేటి నుండి ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జాతీయ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ మండలంలోని పలు గ్రామాలలో పశువులకు ఈ నెల 16 నుండి ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి విజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 14 వరకు కొనసాగుతుందని, ఆయా గ్రామాలకు పశు వైద్య సిబ్బంది వచ్చిన సమయంలో ఖచ్చితంగా పశువులకు ఈ టీకాలు వేయించాలని సూచించారు.

ఉపాధ్యాయులు విధుల పట్ల నిబద్ధత కలిగి ఉండాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధ్యాయులు విధుల పట్ల నిబద్ధతగా పనిచేసి విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన డీఎస్సీ-2024 అభ్యర్థుల కౌన్సెలింగ్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డీఎస్సీ-2024లో ఎంపికై నియామక ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులకు పోస్టుల కేటాయింపు సంబంధిత కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 340 పోస్టులు ఖాళీ ఉండగా కౌన్సెలింగ్‌కు 270 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. ఉపాధ్యాయులుగా నియమితులైన వారు విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించడానికి విధుల పట్ల చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

డీఎస్సీ కౌన్సిలింగ్ అభ్యర్థులకు కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి ఆరోపించారు. కౌన్సెలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కౌన్సెలింగ్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పిల్లలతో అభ్యర్థులు వచ్చారని వారికి కనీస వసతులు కల్పించలేదన్నారు. ఉదయం నుండి ఎదురుచూస్తున్న వారికి కూర్చోవడానికి కుర్చీలు కూడా లేక ఇబ్బందులు పడ్డారన్నారు. అధికారులు ఖాళీల జాబితాను పదేపదే మార్చడంతో కనీసం పనిచేసే ప్రదేశాన్ని కూడా ఎంచుకొనే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. అధికారుల అలసత్వం బాధ కలిగించిందన్నారు. అభ్యర్థులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు హేమంత్ షిండే, ఉషన్న, రమేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై కేంద్ర బృందం తనిఖీ



నవతెలంగాణ-కౌటాల

ఉపాధి హామీ పనులపై కేంద్ర బృందం మంగళవారం తనిఖీ చేసింది. కేంద్ర మానిటరింగ్ అధికారులు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఉపాధి హామీ ఐకేపీ పనులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మండలంలోని వీర్దండి, కనికి, తలోడి గ్రామపంచాయతీలలో పనులు చేసిన రికార్డులను చూసి వివరాలను సేకరించారు. వారి వెంట ఎంపీడీఓ కోట ప్రసాద్, ఏపీఎం ముక్తేశ్వర్, ఈసీ సంతోష్, పంచాయతీ కార్యదర్శులున్నారు.

ఉచిత కంటి పరీక్షా శిబిరాలకు స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాలైఫ్‌కేర్ ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరానికి 41 మంది హాజరు కాగా వీరికి పరీక్షలు నిర్వహించి 28 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి విడతల వారీగా ఆపరేషన్లు చేయించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని కంటి చూపు మందగించిన వారు, కంటి శుక్లాలున్న వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కిమ్స్ ఆస్పత్రిలో...

అదేవిధంగా కిమ్స్ ఆస్పత్రిలో శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో కూడా మంగళవారం ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 32 మందికి పరీక్షలు నిర్వహించగా, 18 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి సహకారంతో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత దంపతులు తెలిపారు. కార్యక్రమంలో అప్తమాలజిస్టుతో పాటు ప్రొగ్రాం ఇన్‌చార్జి గోపి పాల్గొన్నారు.



ఉద్యోగం సాధించిన డీఎస్సీ అభ్యర్థికి సన్మానం

నవతెలంగాణ-జన్నారం



పొనకల్ గ్రామానికి చెందిన గౌడ కులస్తులు సల్లా శంకర్ గౌడ్, లావణ్య దంపతుల కూతురు సల్ల సుస్మిత డీఎస్సీలో జిల్లాలోని మూడవ ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సంపాదించిన సందర్భంగా మంగళవారం పొనకల్ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు పొడిటి సతీష్ గౌడ్, జన్నారం మండల గౌడ సంఘం అధ్యక్షుడు మూల భాస్కర్ గౌడ్, మోకు దెబ్బ రాష్ట్ర నాయకులు బాలసాని శ్రీనివాస్ గౌడ్, ఓల్లాల నర్సా గౌడ్, మండల నాయకులు ఎరుకల రమేష్ గౌడ్, గొల్లపల్లి రమేష్ గౌడ్, ఓల్లాల వెంకటేష్ గౌడ్, గర్రెపల్లి శంకర్ గౌడ్ ఎనుగంటి కిరణ్ కుమార్ గౌడ్, కొండ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం



మండల ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంఘం నూతన కార్యవర్గాన్ని మండల గౌరవ అధ్యక్షుడు కస్తూరి ప్రభాకర్, గౌరవ సలహాదారు వడ్డేపల్లి రాజమొగిలి, దుంపటి శ్రీనివాస్, సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుమాల ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా ఉప్పారపు శేఖర్, కోశాధికారిగా తోట చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా వసంత్, ఉప కార్యదర్శులుగా జూల మహేష్, కస్తూరి సాయి, ప్రచార కార్యదర్శులుగా పవన్ చారి, వినోద్, సలహాదారులుగా అంజన్న వేణులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

స్లేట్స్ పాఠశాలలో ఘనంగా కూచిపూడి డాన్స్ డే



నవతెలంగాణ-జన్నారం

కూచిపూడి డాన్స్ డేను పురస్కరించుకొని మండల కేంద్రంలోని స్లేట్ హై స్కూల్ లో మంగళవారం 300 మంది విద్యార్థులు ఒకేసారి ఒకే రకంగా డాన్స్ చేసి అబ్బురపరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్లేట్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. డాన్స్ చేయడం వలన మనకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. కూచిపూడి డాన్స్ అనేది ప్రతి ఒక్క విద్యార్థి నేర్చుకోవాలన్నారు. దీనివలన మన జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా డాన్స్ మాస్టర్‌లు బొమ్మిడి నరేష్ కుమార్, రమేష్ హాజరయ్యారు. వారిని స్లేట్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ షరీస్ ఖాన్, అకాడమీ డైరెక్టర్ ఏనుగు రజితరెడ్డి, డాన్స్ మాస్టర్ నర్మదా, సుధా, కృష్ణ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మాదారంలో సీపీఐ కౌన్సిల్ సమావేశం



నవతెలంగాణ-తాండూర్

సీపీఐ మండల కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారం మాదారం టౌన్షిప్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కౌన్సిల్ సమావేశానికి సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే స్థానిక ఎలక్షన్లలో అన్ని స్థానాలలో పోటీకి సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐని వీడి బీఆర్ఎస్‌లోకి వెళ్లిన సీపీఐ మండల కార్యదర్శి శాలిగామ సంతోష్ తిరిగి సీపీఐలో చేరారు. పార్టీలో చేరిన శాలిగామ సంతోష్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సంతోష్ మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని ప్రజాసంఘాలను బలోపేతం చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో మిట్టపల్లి వెంకటస్వామి బొల్లం పూర్ణిమ గుండా చంద్ర మాణిక్యం ఆడెపు రాజమౌళి బొంతల లక్ష్మీనారాయణ బయ్య మొగిలి నరాల ప్రహ్లాద్ వాసాల నాగరాజు మాదారం త్రిన్ టౌన్ సెక్రటరీ మాదారం టౌన్షిప్ సెక్రటరీ పట్టి శంకర్ మలిశెట్టి సత్యనారాయణ సముద్రాల ఆనంద్ ఉప్పల అంజన్న పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి దేవాలయం ప్రారంభం

నవతెలంగాణ-లక్సెట్టిపేట

స్థానిక గోదావరి రోడ్‌లోగల పెద్దమ్మ తల్లి దేవాలయాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌లు మాట్లాడుతూ మా కుల దైవమైన పెద్దమ్మ తల్లికి ముదిరాజ్ సభ్యులందరూ మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన అనంతరం కుంకుమ పూజలు, మంగళ హారతులతో ఆలయ ప్రాంగణం కలకల లాడింది. మూడు రోజులు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. అమ్మవారికి మహిళలు పెద్దఎత్తున భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య గోదావరి రోడ్ మొత్తం మారుమోగింది. ఈ కార్యక్రమంలో పండితులు శ్రీధరాచర్యులు, రామానందాచారిలు నిర్వహించగా ముదిరాజు కుల పెద్దలు ముందుండి కార్యక్రమ నడిపించారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌గా రమేష్

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాల నూతన ప్రిన్సిపల్‌గా బాటని ఉపాధ్యాయుడు ఆర్ రమేష్ బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపల్ జయకృష్ణ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆదర్శ పాఠశాల డిప్యూటీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించినందుకు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తూ 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు పనిచేస్తామని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం ఆదర్శ పాఠశాల సిబ్బంది ఆయనను సన్మానించారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న అవార్డు గ్రహీత ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొలిసెట్టి బుచ్చన్న మాట్లాడుతూ అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని దేశ సేవలో ముందు ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శ్యామల, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి పాల్గొన్నారు.

రేపు మహర్షి వాల్మీకి జయంతి

నవతెలంగాణ-నస్పూర్

కలెక్టర్ కార్యాలయంలో 17వ తేదీన ఉదయం 10 గంటలకు మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.వినోద్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వేడుకలు విజయవంతం చేయాలని కోరారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-వేమనపల్లి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని వేమనపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి వార్డులు, ఫార్మసీ, రిజిస్టర్లు, రికార్డులు, పరిసరాలు పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం కొరకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని, ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలలో అవసరమైన మందుల నిల్వలను అందుబాటులో ఉంచడంతో పాటు వైద్యులు, సిబ్బందిని నియమించడం జరుగుతుందని తెలిపారు. వర్షాకాలంలో ఎలాంటి సీజనల్, అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. అనంతరం డంపింగ్ యార్డును పరిశీలించి ప్రతి రోజు ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని అన్నారు. ఇందులో ఉపయోగపడే చెత్తను వేరు చేసి కంపోస్ట్ షెడ్కు తరలించి సేంద్రియ ఎరువు తయారు చేయాలని, మొక్కల పెంపకానికి వినియోగించాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా కషి చేయాలని తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయం కొరకు నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసే విధంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించి గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని, గ్రామాలలో ఎక్కడా చెత్తా, చెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి తరగతి గదులు, వంటశాల, పరిసరాలను పరిశీలించి విద్యార్థుల హాజరు శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

సింగరేణి ఏరియా ఆస్పత్రిలో వైద్య సదుపాయాలు కల్పించాలి



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రిలో వైద్య సదుపాయాలు కల్పించి డాక్టర్లను వైద్య సిబ్బంది నియమించాలని బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రి పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం ఆ కమిటీ ఆస్పత్రిని సందర్శించి మెడికల్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరిరక్షణ కమిటీ నాయకులు మాట్లాడుతూ గత మూడు నాలుగు దశాబ్దాలుగా ఏరియా ఆసుపత్రితో పాటు ఐదు డిస్పెన్సరీలతో కార్మికులకు వారి కుటుంబాలకు వైద్యం అందించినట్లు తెలిపారు. సింగరేణి యాజమాన్య సంస్కరణల్లో భాగంగా 200, పడకలుగా ఉన్న ఆస్పత్రి వార్డులన్నీ మూసివేసే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఎమర్జెన్సీ వార్డుని జనరల్ వార్డ్‌గా చేసుకొని వైద్య సేవలు అందకుండా అవుటు పేషెంట్లను కూడా తక్కువగా చూపిస్తూ డిస్పెన్సరీ స్థాయికి దిగజార్చే కుటిల ప్రయత్నం చేస్తుందన్నారు. రిటైర్డ్ కార్మికులకు, కాంట్రాక్టు కార్మికులకు వారి కుటుంబాలకు వైద్య సేవలు అందకుండా చేసే కుట్రలను బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రి పరిరక్షణ కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని తెలిపారు. అన్ని రకాల వైద్యులను నియమించాలని, అన్ని వార్డులు తెరవాలని, సరిపడినంత మంది పారామెడికల్ సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. బెల్లంపల్లి శాసనసభ్యులు, వారి చొరవతో సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆగస్టులో సందర్శించిన సందర్భంగా పరిరక్షణ కమిటీతో చర్చించినప్పటికి ఫలితం లేకపోయింద న్నారు. బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రి పరిరక్షణ కోసం కార్మికులంతా పోరాటంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ చాంద్ పాషా, టి మణి రామ్ సింగ్, ఎ మహేందర్, నీరటి రాజన్న, గోగర్ల శంకర్, బొల్లు మల్లయ్య, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభం

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత శిక్షణ తరగతులు మంగళవారం ప్రగతి స్టేడియంలోని సి ఆర్ క్లబ్‌లో శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి, సేవా సమితి అధ్యక్షురాలు రాధాకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి సేవా సమితి ద్వారా అనేకమంది మహిళలు ఉచిత వృత్తి శిక్షణ కోర్సులను నేర్చుకుని తమ కాళ్ళ మీద తాము నిలబడడం చాలా సంతోషంగా ఉందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ డీటీపీ కోర్సులను ఈరోజు ప్రారంభించుకోవడం చాలా సంతోషకరమైన విషయమని తెలిపారు. ఈ కోర్సులను నేర్చుకోవడంతో పాటు నలుగురికి ఉపాధి కల్పించాలని, దానికోసం ప్రతి ఒక్క మహిళా కృషి చేయాలని తమ కుటుంబానికి ఆర్థిక స్వావలంబన సాధించడానికి ఇది మంచి అవకాశం అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో వృత్తి శిక్షణ కోర్సులు నేర్చుకునే మహిళలు ఎక్కువమంది ఉంటారని, ప్రతి ఒక్క మహిళ శిక్షణ తరగతులకు హాజరై మెలకువలను నేర్చుకోవాలని సూచించారు. నూతన కోర్సులను నేర్చుకోవడానికి మహిళలు ముందుకు వస్తే నూతన కోర్సులను కూడా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, సీనియర్ పీఓ పి కాంతారావు, సేవా సెక్రటరీ కొట్టే జ్యోతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించిన కేంద్ర కమిటీ సభ్యులు



నవతెలంగాణ-జైపూర్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల నిర్వాహన తీరును కేంద్ర కమిటీ సభ్యుల బృందం పరిశీలించింది. మండల పరిషత్ అధికారులతో కలిసి కేంద్ర కమిటీ సభ్యులు కేహెచ్ సునీల్, సీవీ బాలమురళి మంగళవారం గంగిపల్లి, బెజ్జాల గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ పంచయతీల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పనితీరు పరిశీలించారు. గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన పనులు జీపీడీపీ ప్రణాళిక తయారీ విధానం, మిషన్ అంత్యోదయ తదితర అంశాలను పరిశీలించిన అనంతరం క్షేత్రస్థాయి పనుల నిర్వహణ పరిశీలించారు. శ్మశాన వాటిక, కంపోస్ట్ పిట్, హార్టికల్చర్ ప్లాంటేషన్, పర్కులేషన్ టాంక్స్ పరిశీలించడంతో పాటు వివరాలను తీసుకున్నారు. మండలానికి వచ్చిన కమిటీ సభ్యులను స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతి బాబురావు, ఏపీడీ సదానందం, ఏపీఎం రాజకుమార్, ఈజీఎస్ ఏపీఓ వెంకటేశ్వర్లు శాలువాలతో సన్మానించారు. గ్రామపంచాయతీలలో పర్యటించిన కేంద్ర కమిటీ సభ్యులతో గంగిపల్లి, బెజ్జాల గ్రామపంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, రమాదేవి, ఐకేపీ సీసీలు, పెన్షనర్లు పాల్గొన్నారు.

ప్రయివేట్ కలశాలల సమ్మె

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలోని ప్రయివేట్ డిగ్రీ, పీజీ కళాశాలల సమ్మె బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు కళాశాలల యాజమాన్యం తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అన్ని విద్యార్థి సంఘాలు, ట్రస్మా సహకారంతో పట్టణంలో రేపు ఉదయం శాంతియుత ర్యాలీ, ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఉపకార వేతనాలు చెల్లించక పోవడం వలన పేద విద్యార్థులు చదువుకు దూరం అయ్యే అవకాశం ఉందన్నారు. రీయింబర్స్‌మెంట్ రాక కళాశాలలు మూత పడే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలు నిర్వహించలేని పరిస్థితిలో ఉండడంతో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని డిగ్రీ, పీజీ కళాశాలలు నిరవధిక బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, ట్రస్మా అసోసియేషన్ సభ్యులు జిల్లాలోని ప్రయివేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు పాల్గొన్నారు.



రూ.పది నాణాలను ప్రతి ఒక్కరు స్వీకరించాలి



నవతెలంగాణ-జన్నారం

పది రూపాయల నాణాలు చెలామణిలో ఉన్నాయని పొనకల్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ దుర్గ వెంకట్ తెలిపారు. మంగళవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పొనకల్ శాఖ ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల మేరకు రూ. పది నాణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రూపాయల నాణాలు చలామణిలో ఉన్నాయని ప్రతి ఒక్కరు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు దుకాణాలలో, చిరు వ్యాపారులకు పది రూపాయల నాణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గార్మి జెండా పండుగ

నవతెలంగాణ-తాండూర్

తాండూర్‌లో ముస్లిం యువకులు ఘనంగా గార్మి జెండా పండుగ నిర్వహించారు. పండగ సందర్భంగా తంగళ్ళపల్లి ఐబీలో గౌసేపాక్ సందల్ ఊరేగింపు నిర్వహించారు. మర్హూం జనాబ్ సఫరుల్లా ఖాన్ ఇంటి వద్ద నుండి సందళ్ ఊరేగింపుతో గౌసేపాక్ చిల్ల వద్దకు చేరుకొని సందల్‌తో జండాలు పెట్టారు. జామా మసీద్ ఇమామ్ అబ్దుల్ కరీం సాబ్ గౌసేపాక్ చిల్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజల సుఖసంతోషాలకై ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందల సంఖ్యలో గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు. అనంతరం ఉదయం తాండూర్ గ్రామంలోని గౌసేపాక్ సందల్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మౌంట్ పతల్స్ పర్వతాన్ని అధిరోహించిన మంచిర్యాల విద్యార్థి



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని నారాయణ స్కూల్‌లో చదువుతున్నా జాటోత్ విహాన్ రామ్ హిమాచల్ ప్రదేశ్‌లోని మౌంట్ పతల్స్ పర్వతాన్ని అధిరోహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. పర్వతాలు అధిరోహించడంలో వరల్డ్ గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించిన మహిపాల్‌రెడ్డి సారథ్యంలో అక్టోబర్ 10న 14600 ఫీట్ల ఎత్తులో ఉన్న పర్వతాన్ని విహాన్ రామ్ 14 గంటల సమయంలో అధిరోహించడం సంతోషంగా ఉందన్నారు. యువతకు మాదాక ద్రవ్యలపై అవగాహన కల్పించడంలో భాగంగా పర్వతాన్ని అధిరోహించడం జరిగిందన్నారు. 8 సంవత్సరాల వయసు కలిగిన విహాన్ రామ్ అంత ఎతైన పర్వతాన్ని అధిరోహించడం గొప్ప విషయమని కొనియాడారు. విహాన్‌ను పాఠశాల ఏజీఎం చైతన్య రావు, ప్రిన్సిపాల్ కవిత వర్మ, సిబ్బంది అభినందించారు.

మాలల మహా పాదయాత్ర విజయవంతం చేయాలి

నవతెలంగాణ-మంచిర్యాల

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా, మాలల హక్కులు సాధించుకొనుటకై అక్టోబర్ 25 నుంచి డిసెంబర్ 1 వరకు జరిగే మహా పాద యాత్రలో ప్రతి ఒక్కరు పాల్గొనలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బద్రచలం నుంచి హైదరాబాద్ వరకు 16 జిల్లా లోని 45 నియోజక వర్గాల మీదుగా పాదయాత్ర కొనసాగుతుంది అన్నారు. జిల్లా లోని మాల కుల బంధావులు, యువతీ, యువకులు, ప్రజాసౌమ్య వాదులు పాదయాత్రలో పాల్గొని తమ సహకారలు అందించాలని కోరారు. సమావేశంలో జై భీమ్ సైనిక్ దళ్ నియోజక వర్గ అధ్యక్షుడు కాటం రాజు, పట్టణ అధ్యక్షుడు దొంతమల్ల శివ, బింగి సదానందం పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న గణితం, రసాయన శాస్త్ర అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలి తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీం తెలిపారు. ఆదర్శ పాఠశాలలో హవర్లీ బేసిస్ పద్ధతిలో గణితశాస్త్రం, రసాయన శాస్త్రం భోధించుటకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధించుటకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 17వ తేదీ 4 గంటల లోపు ధ్రువీ కరణ పత్రాల జిరాక్స్ ప్రతులతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టుల్లో ఎంఎస్సీ, బీఈడీ చేసిన వారు అర్హులని, బోధనా అనుభవం గలవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. వేతనం గరిష్టంగా నెలకు రూ.18200 ఉంటుందని తెలిపారు.

డిగ్రీ కళాశాల బంద్ విజయవంతం

నవతెలంగాణ-జన్నారం

పట్టణంలోని వివిధ ప్రయివేట్ డిగ్రీ కళాశాలలను నిర్వాహకులు నిరవధికంగా బంద్ చేశారు. ఫీజు బకాయలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ వారు రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా పట్టణంలో ఉన్న ప్రయివేట్ డిగ్రీ కళాశాలలను మూసివేశారు. 3 సంవత్సరాలుగా ఫీజు బకాయిలు రాకపోవడంతో కళాశాలలను నడపలేని పరిస్థితిలో ఉన్నామని, అందుకే కళాశాలలను నిరవధికంగా బంద్ చేస్తున్నామని కళాశాలల ముందు వారు బ్యానర్లు పెట్టారు. ఈ సందర్భంగా ఏఆర్ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ముత్యం సతీష్ మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ త్వరగా విడుదల చేయాలని కోరారు. లేకుంటే విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు డిగ్రీ కళాశాలలకు సహకరించాలని కోరారు.